WANTED REPORTERS
నవతరం
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ కావాలన్న
కోరిక ఉందా...
ఐతే నవతరం మీ కోసం
అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది.
వివరాలకు : 9618907705
navataramtelugudaily@gmail.com

నవతరం
తెలుగు దినపత్రిక

ప్రచురణ కేంద్రం: హైదరాబాద్ , రాజమండ్రి | సంపుటి : 12 | సంచిక : 289 | బుధవారం 18-2-2026 | పేజీలు : 4 | వెల : 5-00

# పలాసలో ఏప్రిల్ కు ఆర్వోబీ

**●జూన్ నుండి కేంద్రీయ విద్యాలయ తరగతులు**

**●కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు**



పలాస, **నవతరం** కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మంగళవారం శ్రీకాకుళం జిల్లాలోని పలాస పట్టణంలో సుడిగాలి పర్యటన చేపట్టారు. ఉదయం 9 గంటలకు పలాస చేరుకున్న కేంద్ర మంత్రి తొలుత రైల్వే స్టేషన్ సమీపంలోని పై వంతెన పనులను సమీక్షించారు. ప్రాజెక్ట్ రిపోర్టును పరిశీలించి ప్రస్తుత స్థితిని ఆరా తీశారు. పనుల్లో ఆలస్యం జరుగుతోందని, రేయింబవళ్ళు పనులు జరగాలని స్పష్టం చేశారు. ఏప్రిల్ నాటికి వంతెనను అందుబాటులోకి తీసుకురావాలని అదేశించారు. రైల్వే వంతెన తో పాటు ఆనుకుని సర్వీసు రోడ్డు పనులు కూడా వేగంగా జరపాలని తెలిపారు. అనంతరం అక్కడి నుండి పలాస లోని నెమలికొండ ప్రాంతాలలో త్వరలో నిర్మాణం జరగనున్న కేంద్రీయ విద్యాలయ ప్రాంతాన్ని పరిశీలించారు. భవనాలు నిర్మాణం జరిగే తీరును ప్రాజెక్టు రిపోర్టు ద్వారా కేంద్ర మంత్రికి కలెక్టర్, ఆర్డీవో వివరించారు.

# 19న ఢిల్లీకి సిఎం రేవంత్ బృందం

కాంగ్రెస్ అగ్రనేతలతో భేటీకి పిలుపు

కేబినేట్‌లో మార్పులు, చేర్పులుపై ఊహాగానాలు






# గ్లోబల్ మ్యానుఫాక్చరింగ్ కేంద్రంగా హైదరాబాద్

**● నాణ్యమైన విద్యాసంస్థలకు నెలువుగా నగరం**

**● జీవవిజ్ఞాన రంగంలో రూ.73,000 కోట్లకు పైగా పెట్టుబడులు**

**● రెండేళ్లుగా స్పష్టమైన విజన్‌తో ముందుకు వెళుతున్నాం**

**● బయో ఏషియా సదస్సు ప్రారంభంలో సిఎం రేవంత్**

హైదరాబాద్,**నవతరం**

హైదరాబాద్ అంటే చార్మినార్.. బిర్యానీ.. ఫార్మా.. సాఫ్ట్‌వేర్ అని గుర్తు.. కానీ ఇవాళ గ్లోబల్ మాన్యుఫాక్చర్‌కి కేంద్రంగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నాణ్యమైన విద్యాసంస్థలు.. ఇక్కడ ఉన్నాయి.. హైదరాబాద్ క్యాపబుల్ సెంటర్‌గా మారిందన్నారు.హైటెక్స్‌లో బయో ఏషియా 2026 సదస్సును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ముందస్తు విజన్, పాలసీతో ముందుకు వెళుతున్నామని అన్నారు. గత రెండు సంవత్సరా ల్లోనే, జీవవిజ్ఞాన రంగంలో రూ.73,000 కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయన్నారు. కొద్ది వారాల క్రితం దావోస్‌లో మా కొత్త లైఫ్ సైన్సెస్ పాలసీని ప్రకటించాం.. జీనోమ్ వ్యాలీని విస్తరించాం.. ప్రపంచ స్థాయి పరిశోధన, ఆవిష్కరణలకు 'వన్-బయో'ను ప్రారంభించాం.. గ్రీన్ ఫార్మా సిటీని వేగవంతం చేసాం? అనేక గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లను ఆహ్వానించామని తెలిపారు. ఇది సాధారణ అభివృద్ధి కాదు.. ఇది దృఢమైన దృష్టి ఫలితమని వెల్లడించారు. దానికి ప్రత్యక్ష సాక్ష్యం బయోఏషియా 2026 అని సీఎం తెలిపారు. ఈ సభను చూస్తుంటే నేను గర్వంగా చెప్పగలను.. బయోఏషియా తన పేరును దాటి, బయో-వరల్డ్‌గా మారుతోందని సీఎం రేవంత్ తెలిపారు. ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా ఉన్న 500 ప్రముఖ సంస్థలకు చెందిన 4,000 మందికి పైగా ప్రతినిధులు ఇక్కడ హాజరయ్యారు.. ఫార్మా, బయోసైన్సెస్, బయోటెక్, బల్క్ డ్రగ్స్, వ్యాక్సిన్లు, ఆరోగ్య రంగాల్లో ప్రముఖులు, బిజినెస్ లీడర్స్ మనతో ఉన్నారని తెలిపారు

. సైన్స్, ఎఐ బయోటెక్ వంటి రంగాల్లో ప్రముఖులను కలిసినప్పుడు అసాధార ణమైన ఫలితాలు వస్తాయనా న్నరు. హైదరాబాద్‌లో జరుగుతున్న బయోఏషియా సదస్సు దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం లాంటి అంతర్జాతీయ గుర్తింపు పొందుతుందన్న నమ్మకం నాకు ఉందని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు

**●మార్చి చివరి నాటికి లబ్దిదారుల ఎంపిక అసంపూర్తి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం**

**●యుద్ధప్రాతిపదికన లబ్దిదారుల ఎంపిక ఆర్,ఆర్, ఆర్, ఓ ఆర్ ఆర్ మధ్య అఫర్డబుల్ హౌసింగ్ పాలసీ**

**●నెలాఖులోగా ఇండ్ల స్థలాలు కలిగిన 28వేల మందికి ఇందిరమ్మ ఇండ్లు**


**●హౌసింగ్ పాలసీపై అధికారులతో మంత్రుల సమీక్ష**




హైదరాబాద్,**నవతరం**

: హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ)పరిధి లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించి వచ్చే మార్చి చివరినాటికి లబ్దిదారుల ఎంపిక పక్రియను పూర్తి చేస్తామని ప్రకటించారు. మురికివాడల్లో ఇందిరమ్మ మోడల్ కాలనీలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి స్థలాల సేకరణ, అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మా ణం పూర్తి, పూర్తయిన ఇండ్ల కేటాయింపు తదితర అంశాలపై మంగళవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు డి. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ తో కలిసి సమీక్షించారు. మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్ట ర్లు, మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు పాల్గొన్నారు.

# గంజాయి అదుపునకు కఠిన చర్యలు



అమరావతి,**నవతరం**

ఏపీ అసెంబ్లీ సమావేశాలు రెండ్రోజుల విరామం అనంతరం మంగళవారం నాలుగవ రోజు ప్రారంభమయ్యాయి. శాసనసభ మొదలైన వెంటనే డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ఆంధ్రా ఒడిస్సా సరిహద్దులో గంజాయి నియంత్రణపై పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రశ్న లేవనెత్తారు. హోం మంత్రి వంగలపూడి అనిత సమాధానమిస్తూ... ప్రస్తుతం రాష్ట్రంలో గంజాయి నియంత్రణలో ఉందని, కూటమి ప్రభుత్వం రాగానే గంజాయిపై ఉక్కిపాదం మోపినట్లు తెలిపారు. వైసీపీ హయాంలో రాష్ట్రం గంజాయి కేంద్రంగా మారిందని విమర్శించారు. గత ప్రభుత్వంలో నియంత్రణ లేకుండా పోయిందని హోంమంతి ఆరోపించారు.

# రోడ్లు శుభ్రం లేకపోతే అధికారులపై చర్యలు

**● రోడ్లు శుభ్రం లేకపోతే అధికారులపై చర్యలు**

**●క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించాలి**

**●ఫీల్డ్‌కు వెళ్లని అధికారులను తొలగిస్తాం**

**●నెక్లెస్ రోడ్డులో మల్టీలెవల్ కారు పార్కింగ్**

**●కొత్త మేయర్లు, మున్సిపల్ చైర్మన్లకు ఒకరోజు శిక్షణ**

**●మున్సిపల్ శాఖపై సమీక్షలో సిఎం రేవంత్ వెల్లడి**



హైదరాబాద్,ఫిబ్రవరి17**నవతరం**

: రోడ్లు శుభ్రంగా లేకపోతే అక్కడికక్కడే అధికారులపై చర్యలు తీసుకుంటానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. కమిషనర్లు, జోనల్ కమిషనర్లు ఉదయం నుంచే ఫీల్డ్‌లో ఉండాలని, రోజూ సమస్యలను పరిష్కరి చాలని ఆదేశించారు.పురపాలక శాఖపై మంగళవారం కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, కమిషనర్లు, సిబ్బందిపై సీఎం సీరియస్ అయ్యారు. త్వరలోనే ప్రతి జోన్‌లో వ్యక్తిగతంగా పర్యటించి పరిస్థితులను పరిశీలిస్తానని స్పష్టం చేశారు. చాలా మంది అధికారులు ఫీల్డ్‌లోకి వెళ్లడం లేదని, అలాంటి వారిని సస్పెండ్ చేస్తానని ముఖ్యమంత్రి వార్నింగ్ ఇచ్చారు. హైదరాబాద్‌తో పాటు మూడు కార్పొరేషన్లలో శానిటేషన్, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన మేయర్లు, డిప్యూటీ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలో స్మార్ట్ పోల్స్ ఏర్పాటు పైన అధ్యయనం చేయాలన్నారు.

ట్రాఫిక్ బాగా ఉన్న చోట పీపీపీ విధానంలో స్కై వాక్ బ్రిడ్జిల ఏర్పాటుపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో మల్టీలెవల్ కార్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అడ్వటైజింగ్ బోర్డుల ఏర్పాటుపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండి పడకుండా చర్యలు ఉండాలని సీఎం తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల కోసం 10 శాతం అడ్వటైజింగ్ బోర్డులు కేటాయించాలని ముఖ్యమంత్రి చెప్పారు.

# గంజాయితో మహాశివుడికి అపచారం

**●దుండుగుల దుందుడుకు చర్యలపై సిపి ఆగ్రహం**

**●తక్షణ చర్యలకు సజ్జన్నార్ ఆదేశం**

**●గంజాయి బ్యాచ్‌ను పట్టుకునేందుకు గాలింపు చర్యలు**



2లో

# ఇతర దేశాల ఆదేశాలు ఇక్కడ పనిచేయవు

**●బంగ్లాసార్వభౌమాధికారంలో వేలుపెట్టనీయం**

**●భారత్ లక్ష్యంగా విమర్శలు చేసిన యూనస్**

**●'సెవెన్ సిస్టర్స్'తో బంగ్లాదేశ్ అపారమైన ఆర్థిక సామర్థ్యాన్ని కలిగి ఉంది**



2లో

## సంపాదకీయం

# వన్యప్రాణులను కాపాడుకుందాం !

ఇటీవల పెద్దపులుల జనావాసాల్లోకి వచ్చి హడలెత్తించాయి. అడపాదడపా చిరుతలు వస్తూనే ఉన్నాయి. అక్కడక్కడా ఎలుగుబంట్లు దాడి చేస్తున్నాయి. కొన్ని జిల్లాల్లో అడవిపందులు, జింకలు పంటలపై దాడులు చేస్తున్నాయి. ఏనుగులు కూడా పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఇకపోతే కోతుల దాడికి హద్దే లేకుండా పోయింది. ఇలా ఇవన్నీ జనావాసాల్లో ఎందుకు వస్తున్నాయో జనాలు ఆలోచించడంలేదు. ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఇవన్నీ ఇలా జనావాసాల మీద పడడానికి కారణం మనమే. అడవులను, కొండలను ధ్వంసం చేసిన పాపానికి భయాన్ని అనుభవిస్తున్నాం. ఇప్పటికీ ఈ విధ్వంసం ఆగడం లేదు. ఆపాలన్న ఆలోచన రావడం లేదు. మనమే ప్రకృతిని ఇలా విధ్వంసం చేస్తూ పోతే ఇకముందు తరాలు ఇంతకు మించి దారుణాలు ఎదదుర్కోక తప్పదు. వానరాలు ఊళ్లమీద పడి విధ్వంసం సృష్టిస్తున్నాయి. ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా సంచరించే పులులు, చిరుతలు, ఏనుగులు, ఎలుగుబంట్లు వంటి వన్యమృగాలు ఇవాళ మన గడప వరకూ వచ్చేస్తున్నాయి. వన్య ప్రాణులు అడవి దాటి, జనారణ్యంలోకి రావడానికి ప్రధాన కారణం? మనం అడవిగా భావిస్తున్న ప్రాంతంలో అవి జీవించలేకపోవడం. వాటికి కావాల్సిన ఆహారం, నీరు సమృద్ధిగా వుంటే, అవి బిక్కుబిక్కుమంటూ రోడ్ల మీదకు రావు. మనిషిలోని నాగరిక లాభాపేక్ష వృక్ష, జంతు, పక్షి జాతుల క్షీణతకు దారితీస్తోంది. పర్యావరణ పరిరక్షణలో అడవుల పాత్ర కీలకం. కానీ, భారతదేశంలో జనాభా విస్ఫోటనం వల్ల వ్యవసాయాభివృద్ధి, పారిశ్రామికీకరణ, నగరీకరణ, భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణం, రోడ్లు, రైలు మార్గాల అభివృద్ధి వంటి కార్యకలాపాలతో అడవుల విస్తీర్ణం క్రమంగా తగ్గుతోంది. ఫలితంగా పర్యావరణ సమతుల్యత లోపిస్తోంది.

వన్య మృగాలను చూసినప్పుడు, వాటిని హింసించకుండా అధికారులకు తెలియజేసే ప్రయత్నాలు రావాలి. గ్రామాల్లో చైతన్య కార్యక్రమాలు నడపాలి. సంబంధిత ప్రభుత్వ శాఖలు సరైన సమయంలో సరైన చర్యలు తీసుకోవడం, ప్రజలు ఆత్మరక్షణ చేసుకుంటూనే, హింసకు దూరంగా ఉండి అధికారులకు సమాచారం అందించడం అత్యవసరం. కేరళలో 'వన్యమృగ బీటర్లు' వంటి స్వచ్ఛంద సంఘాలు వన్య మృగాలను పట్టి, అడవుల్లో విడిచిపెడతారు. అలాగే, సోలార్ ఫెన్సింగ్, బయోఫెన్సింగ్ వాడుతారు. వన్యప్రాణులను మన 'అతిథులు'గా చూడాలి. వాటిని తిరిగి అడవిలోకి పంపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో అడవుల పునరుద్ధరణకు పూనుకోవాలి. చిన్నా, పెద్ద తేడా లేకుండా పర్యావరణం పట్ల అవగాహన కలిగించాలి. మనిషిని, వన్యమృగాన్ని రక్షించే ఏకైక మార్గం?అడవులను, పర్యావరణాన్ని కాపాడుకోవడం అన్న సంగతి గుర్తించాలి. అడవులను నరికివేయడం,ఖనిజాల వెలికితీత పేరుతో కొండలను ధ్వంసం చేయడం వల్ల జరుగుతున్న దుష్పరిణామం ఇది. సహజవనరులను దోచుకోవడానికి అటవీ భూములను కట్టబెట్టడం, అభివృద్ధి పేరుతో ప్రకృతి సిద్ధమైన సహజ ఆవాసాలను, టూరిజం పేరుతో కొండలు, గుట్టలను ఛిద్రం చేయడం వంటి దుశ్చర్యల ఫలితమే ఈ ఫలితం అని గుర్తించాలి. ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకల్లోని అటవీ పరిసర ప్రాంతాల్లో ఇలాంటి సంఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. ఇది కేవలం వన్యమృగాల దూకుడు మాత్రమే కాదు, మనిషి దుందుడుకు చర్యలకు ప్రతిస్పందన కూడా! అ వన్యప్రాణుల వలసకు మూల కారణం మానవాభివృద్ధి తెచ్చిన దురాశ. దేశంలో 1951లో 40.4 శాతం అటవీప్రాంతం ఉండగా, ఇప్పుడది 21.7 శాతానికి తగ్గినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఫాస్ట్ ట్రాక్ ప్రాజెక్టులు, మైనింగ్, రోడ్లు, రియల్ ఎస్టేట్‌లు సహజ అడవులను మింగేస్తున్నాయి. దాదాపు 70 శాతం మంది భారతీయులు అడవులకు సమీపంలోనే నివసిస్తున్నారు.

మనిషి- వన్యప్రాణుల సంఘర్షణ వల్ల ప్రతి సంవత్సరం 500 మందికి పైగా మరణిస్తున్నారని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఇది వందలాది వన్యమగాల మరణాలకూ కారణమౌతోంది. 'భూమి మనందరి ఆస్తి కాదు'. కానీ మనం అడవులను సొంత 'ఆస్తి'గా భావిస్తూ విధ్వంసానికి పాల్పడుతుండటం వల్లే ప్రకృతి తిరుగుబాటు చేస్తోంది. ఇటీవల తెలంగాణ,తూర్పుగోదావరి జిల్లా ప్రజలకు కొన్ని రోజుల పాటు కంటిమీద కునుకు లేకుండా చేసిందో పెద్దపులి. ఎట్టకేలకు అటవీశాఖ సిబ్బంది దానికి మత్తు ఇంక్షన్ ఇచ్చి పట్టుకున్నారు. తెలంగాణలోని జనగామ, సిద్ధిపేట జిల్లాల పరిధిలోనూ పెద్దపులి సంచారం కలకలం రేపింది. ఇళ్లలోకి, పంట పొలాల్లోకి పులి తదితర జంతుజాలం వచ్చేస్తున్నాయి. ఏనుగులు సైతం పంట పొలాల్లోకి వచ్చి ధ్వంసం చేస్తున్న ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. నెమళ్లు వంటి అరుదైన పక్షులకూ భద్రత లేకుండాపోయింది.

ఇది సహజ పర్యావరణ వ్యవస్థలను భంగపరచడంతో పాటు, జీవవైవిధ్యాన్ని నిర్వీర్యం చేస్తోంది. ఒక చెట్టు పడిపోతే పది చెట్లను నాటడం అలవాటు చేయాలి. ఇప్పుడు దేశానికి కావాల్సింది అటవీ సంరక్షణ, ప్రకృతి విధ్వంసం ఆపడం. అడవుల నరికివేతను అరికట్టాలన్న దృఢనిర్ణయం, మానవుల నుంచి రక్షణ కల్పించడం అన్నది ఉద్యమంగా సాగాలి. ప్రకృతి మనకు ఇచ్చిన బహుమతి అడవి. మనం దాన్ని కాపాడుకోవడం ద్వారా మనలను మనం రక్షించుకోవాలి. ప్రకృతిపై మనిషికి అధికారం లేదు. బాధ్యత మాత్రమే వుంది అన్న విషయాన్ని గుర్తించాలి. అప్పుడే వన్యప్రాణులకు రక్షణ ఉంటుంది.

# గంజాయితో మహాశివుడికి అపచారం

హైదరాబాద్,ఫిబ్రవరి 17:శివరాత్రి పర్వదినం వేళ గంజాయి బ్యాచ్ రెచ్చిపోయింది. దేవాలయం వద్ద శివునికి గంజాయిని ప్రసాదంగా సమర్పించబోయారు కొందరు ప్రబుద్ధులు. అంతేకాదు.. దీనిని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో ఆ వీడియో కాస్తా వైరల్‌గా మారింది. దీనిని చూసిన నెటిజన్లు.. సదరు వ్యక్తుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విషయాన్ని నేరుగా హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్‌కి దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై సీరియస్‌గా స్పందించిన సీపీ సజ్జనార్.. వీడియోలోని వ్యక్తులపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. సీపీ ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు.. సదరు గంజాయి బ్యాచ్‌ను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని శంషాబాద్ ధర్మగిరి దేవాలయం వద్ద మహా శివునికి గంజాయిని ప్రసాదంగా పెడుతున్నామంటూ కొందరు యువకులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దేవుడికి అందరూ కొబ్బరికాయ కొడితే.. తాము ప్రత్యేకంగా గంజాయి పెడుతున్నామంటూ వీడియోలో వివరించారు. దీనిని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు.
ఈ వీడియో వైరల్ కావడంతో నెటిజన్లు.. నగర సీపీ సజ్జనార్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో వీడియోను పరిశీలించి.. సదరు యువకులు బడంగ్‌పేట్‌కు చెందిన చరణ్‌తోపాటు అతడి స్నేహితులుగా పోలీసులు గుర్తించారు. వారిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ తరహా రీల్స్ పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని యువకులను నగర సీపీ వీసీ సజ్జనార్ హెచ్చరించారు.

# ఇతర దేశాల ఆదేశాలు ఇక్కడ పనిచేయవు

ఢాకా,ఫిబ్రవరి17 బంగ్లాదేశ్‌లో రాడికల్ శక్తులకు సహాయం చేయడం, మైనారిటీ హిందువులను రక్షించడంలో విఫలమయ్యారని విమర్శలు ఎదుర్కొంటున్న బంగ్లా తాత్కాలిక పాలకుడు మహ్మద్ యూనస్ దిగిపోతూ భారత్‌పై తన అక్కసును వెళ్లగక్కారు. భారతదేశ సార్వభౌమాధికారాన్ని ధిక్కరిస్తూ, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. 2024లో హసీనా తన పదవికి రాజీనామా చేసి, భారత్ పారిపోయి వచ్చిన తర్వాత యూనస్ అధికారం చేపట్టి బంగ్లాలో భారత వ్యతిరేకతను పెంచి పోషించాడు. తాజాగా ఆయన చేసిన ప్రసంగంలో భారత్‌పై తన వ్యతిరేకతను వెల్లడించారు. విదేశాంగ విధానంలో బంగ్లాదేశ్ సార్వభౌమాధికారం, గౌరవం, స్వాతంత్ర్యాన్ని తిరిగి పొందిందని, ఇకపై ఇతర దేశాల ఆదేశాలపై పనిచేయదని చెప్పారు. భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటూ ఈ వ్యాఖ్యలు చేశాడు. భూటాన్, నేపాల్, 'సెవెన్ సిస్టర్స్'తో బంగ్లాదేశ్ అపారమైన ఆర్థిక సామర్థ్యాన్ని కలిగి ఉందని చెప్పారు. భారతదేశంలోని అంతర్భాగమైన 7 ఈశాన్య రాష్ట్రాలను ఉద్దేశించి యూనస్ ఈ వ్యాఖ్యలు చేశారు.

తన హయాంలో చైనా, జపాన్, యూఎస్ఏ, యూరప్‌తో బంగ్లా సంబంధాలను పెంచానని, భారతదేశ వ్యూహాత్మక 'సిలిగురి కారిడార్'కు సమీపంలోని తీస్తా నదిపై చైనా సహాయంతో ప్రాజెక్టులు కడుతున్నామని చెప్పారు. ఇదే కాకుండా బంగ్లాదేశ్ సైన్యాన్ని విదేశాల దురాక్రమణను ఎదుర్కోవడానికి బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. ఇది భారత్‌ను ఉద్దేశిస్తూ చేసిన వ్యాఖ్యగా పరిగణిస్తున్నారు. తాజాగా జరిగిన బంగ్లాదేశ్ ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్పీ) సంచలన విజయం సాధించింది. ఆ పార్టీ అధ్యక్షుడు తారిఖ్ రెహ్మాన్, బంగ్లాదేశ్ ప్రధానిగా 17న ప్రమాణస్వీకారం చేశారు. అయితే, దిగిపోతూ కూడా యూనస్ తన భారత వ్యతిరేకతను దాచుకోలేదు. పరోక్షంగా భారత్‌తో బంగ్లా సంబంధాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారు.

# వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ క్లీన్‌స్వీప్

**పది మున్సిపాలిటీల్లో హస్తం హవా**

**అన్నింటా కాంగ్రెస్ చైర్మన్ల ఎన్నిక**

వరంగల్,ఫిబ్రవరి17 ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మొత్తం 12 మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేసింది. ఆ జాబితాలోని 10 మున్సిపాలిటీలలో ఆ పార్టీకి స్పష్టమైన మెజారిటీ వచ్చింది. ఇక హంగ్ ఏర్పడిన తొర్రూర్, జనగామ మున్సిపాలిటీలు లక్కీ డ్రా ద్వారా చైర్మన్ పదవులను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. తొర్రూరు, జనగామలో సోమవారం పరస్పర విమర్శలు, ఆరోపణల మధ్య ఉద్రిక్తత నెలకొంది. అయితే అనూహ్యంగా ఇక్కడ ఎన్నికను వాయిదా వేశారు. దీంతో మంగళవారం తిరిగి ఎన్నికల నిర్వహించారు. జనగామ మున్సిపాలిటీ చైర్ పర్సన్‌గా బాలామణి (కాంగ్రెస్), వైస్ చైర్మన్: పర్వతాలు (బీఆర్ఎస్) ఎన్నికయ్యారు. తొర్రూరు మున్సిపాలిటీ చైర్మన్: తూనం శ్రవణ్ (కాంగ్రెస్)వైస్ చైర్ పర్సన్: రజిని ఎన్నికయ్యారు. డోర్నకల్ మున్సిపాలిటీ చైర్ పర్సన్: కుండేటి రాజకుమారివైస్ చైర్మన్: లావణ్య ఎన్నికయ్యారు. భూపాలపల్లి మున్సిపాలిటీ చైర్మన్: బుర్ర కొమురయ్యవైస్ చైర్మన్: శ్రీనివాస్ ఎంపికయ్యారు. ఇదిలావుంటే తొర్రూరు మున్సిపాలిటీ పీఠం బీఆర్ఎస్‌కు దక్కకుండా ఉండాలని కాంగ్రెస్ నీచ రాజకీయాలకు పాల్పడిందని మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో చైర్మన్ ఎన్నికను మంగళవారానికి వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ పీఠం దక్కించు కునేందుకు కాంగ్రెస్ కుట్రలు పన్నిందన్నారు. ఈ క్రమంలోనే మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు వెళ్లకుండా ఇంచార్జిలు మధుసూదనాచారి, సత్యవతి రాథోడ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. తొర్రూరు వెళ్లకుండా మహబూబాబాద్‌ఋలోనే సత్యవతి రాథోడ్‌ను హౌస్ అరెస్టు చేశారు. ఇక మధుసూదనచారిని హన్మకొండ శాంతినికేతన్ అపార్ట్‌మెంట్‌లో సుబేదారి పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా సోమవారం నాడు ఉద్రిక్త వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. నిన్న ఉద యం 10 గంటలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తొమ్మిది మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లతో కలిసి తొర్రూరుకు చేరుకున్నారు. అయితే, అన్నారం రోడ్డు వద్ద ఆయనను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయగా, బీఆర్ఎస్ కార్యకర్తలు అభ్యంతరం



తెలుపడంతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. మరోవైపు ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, ఆమె అత్త ఝాన్సీరెడ్డి మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా బీఆర్ఎస్ కార్యకర్తలు నిరసనకు దిగారు. మాజీ మంత్రి దయాకర్‌రావును అడ్డుకోవడమేంటని ఆగ్రహం వ్యక్తంచేశారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య తొర్రూరు మున్సిపాలిటీ కార్యాలయానికి చేరుకునే క్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకు న్నాయి. ఒకే ఓటును రెండుచోట్ల వినియోగించొద్దని అంటూ ఖమ్మం
-వరంగల్ జాతీయ రహదా రిపై కారుకు అడ్డంగా బైఠాయించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో తొర్రూరు డీఎస్పీ కృష్ణకిశోర్ లాఠీచార్జ్ చేసి కార్యకర్తలను చెదరగొట్టి, ఎంపీని అనుమతించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది.

# 19న ఢిల్లీకి సిఎం రేవంత్ బృందం

హైదరాబాద్,ఫిబ్రవరి17

తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకోబోతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ బృందం ఈ నెల 19న ఢిల్లీకి వెళ్లనుంది. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మారుతున్న రాజకీయ సమీకరణలు, పార్టీ బలోపేతం , భవిష్యత్తు కార్యాచరణపై చర్చించేందుకు ఏఐసీసీ అగ్ర నాయకత్వం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రివర్గంలోని పలువురు కీలక మంత్రులు ఈ పర్యటనలో పాల్గొనబోతున్నారు. వీరితో పాటు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కూడా ఈ సమావేశంలో భాగస్వామి కానున్నారు. 19వ తేదీ ఉదయం ఢిల్లీకి చేరుకోనున్న వీరు, కాంగ్రెస్ అగ్ర నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ , కేసీ వేణుగోపాల్‌తో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. రాష్ట్రంలో పాలన మొదలై రెండేళ్లు దాటిన క్రమంలో, క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిపై నివేదిక ఇవ్వనున్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఈ భేటీ తర్వాత తెలంగాణ క్యాబినెట్‌లో మార్పులు లేదా చేర్పులు ఉండొచ్చనే ఊహాగానాలు కూడా

రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి.
ఖాళీల భర్తీతో పాటు పలువురి మంత్రి పదవుల్లో మార్పులు చేర్పులు చోటుచేసుకునే వీలుందని అంటున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలవుతున్న సంక్షేమ పథకాలు, ముఖ్యంగా గ్యారెంటీల అమలు తీరుపై అధిష్టానం సమీక్షించనుంది. అలాగే ఇటీవల వరుస ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాలపైనా కాంగ్రెస్ అగ్రనాయకత్వం సంతృప్తితో ఉంది. ప్రభుత్వ పనితీరుతో పాటు పార్టీ నిర్మాణం, సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేయడం , పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీపై అధిష్టానం దిశానిర్దేశర చేయనుంది. అలాగే విపక్షాల విమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టడం , భవిష్యత్తు ఎన్నికల వ్యూహాల గురించి రాహుల్ గాంధీ స్వయంగా నాయకులకు సూచనలు చేసే అవకాశం ఉంది. కాంగ్రెస్ అధిష్టానం ప్రస్తుతం వివిధ రాష్ట్రాల నాయకులతో వరుస సమావేశాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగానే 19వ
తేదీ ఉదయం తెలంగాణ నేతలతో సమావేశమై, అదే రోజు సాయంత్రం మహారాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వంతో భేటీ కానుంది.

రాష్ట్రంలో పార్టీ స్థితిగతులను మెరుగుపరచడంతో పాటు, ప్రభుత్వం , పార్టీ మధ్య సమన్వయాన్ని పెంచడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తోంది.

# సంబంధం లేని అంశాలతో సభలో డ్రామా

అమరావతి,ఫిబ్రవరి17 శాసనమండలిలో వైసీపీ సభ్యుల ఆందోళనపై ఏపీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ మాత్రం సంబంధం లేని అంశాలని సభ దృష్టికి తీసుకొచ్చి.. సభలో పెద్ద డ్రామా సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. హిందూ దేవుళ్లపై పగబట్టినట్టుగా వైసీపీ సభ్యులు ప్రవర్తిస్తున్నారని ఫైర్ అయ్యారు. హెరిటేజ్‌కు, తిరుపతి లడ్డూకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. సంబంధం లేని సంస్థను తిరుపతి లడ్డూ వివాదంలోకి తీసుకువచ్చి రాద్ధాంతం చేస్తున్నారని దుయ్యబట్టారు.తిరుమల పవిత్రతను దెబ్బతీసింది ఎవరని చిన్న పిల్లలను అడిగినా చెబుతారని అచ్చెన్నాయుడు అన్నారు. తిరుమల పవిత్రతను వైసీపీ నేతలు, జగన్ కుటుంబం దారుణంగా దెబ్బతీసిందని ధ్వజమెత్తారు. జగన్ బాబాయే తిరుమల లడ్డూలో కల్తీ జరిగిందని ఒప్పుకొన్నారని ప్రస్తావించారు. చేసిన తప్పిదానికి లెంపలేసుకోవాల్సింది పోయి.. ఇంకా వెనకేసుకొచ్చి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఆధారాలు ఉంటే చూపించాలని వైసీపీ సభ్యులను చైర్మన్ కోరాలని అన్నారు. తిరుమల లడ్డూ విషయంలో.. యావత్ హిందూ సమాజం జగన్ అండ్ కోను ఛీకొడుతోందని అచ్చెన్నాయుడు అన్నారు. సభను పక్కదారి పట్టించాలనే ఉద్దేశంతో వైసీపీ సభ్యులు ఆందోళన చేస్తున్నారని మండిపడ్డారు.

# నిర్లక్ష్యం వద్దు.. ఫైర్ సేఫ్టీలో రాజీ పడొద్దు

**హాస్టళ్ల నిర్వాహకులకు సూచించిన హైడ్రా కమిషనర్ - ఫైర్ సేఫ్టీపై హాస్టళ్ల నిర్వాహకులకు హైడ్రా అవగాహన**










హైదరాబాద్, నవతరం: అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.. ఫైర్ సేఫ్టీ విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని హాస్టళ్ల నిర్వాహకులకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. వస్తున్నది వేసవి కాలం.. ఎక్కడ ఏమాత్రం పొరపాటు జరిగినా పెనుముప్పు సంభవిస్తుంది.. ఇటీవల నగరంలో జరిగిన అగ్ని ప్రమాదాలే ఇందుకు నిదర్శనమన్నారు. నగరంలో లెక్కకు మిక్కిలిగా ఉన్న హాస్టళ్లు చాలావరకు ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించడం లేదని ఫిర్యాదుల నేపథ్యంలో అగ్ని ప్రమాదాలపై హైడ్రా మంగళవారం ఓ అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించింది. హాస్టళ్ల నిర్వాహకులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఫైర్ సేఫ్టీ విషయంలో పలు సూచనలు, హెచ్చరికలు చేశారు. దేశవ్యాప్తంగా అనేకమంది నగరానికి వచ్చి జీవనోపాధి పొందుతున్నారు. నగరంలోని పలు హాస్టళ్లలో నివాసం ఉంటున్నారు. మీరు నిర్వహిస్తున్న హాస్టల్ వారికి ఓ వరం కావాలి. వారి బంగారు భవిష్యత్తుకు హాస్టళ్లు ఒక మెట్టుగా ఉండాలి. వారి భద్రత విషయంలో రాజీ పడొద్దని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు.

**చిన్నపాటి జాగ్రత్తలతో..**

హాస్టళ్ల నిర్వాహకులతో సమావేశానికి ముందు క్షేత్రస్థాయిలో పరిస్థితిని తెలుసుకుందామని హైడ్రా అధికారులతో కలసి ఎల్లారెడ్డి గూడ, సంజీవరెడ్డినగర్ ప్రాంతాల్లోని మూడు హాస్టళ్లను ర్యాండమ్‌గా చెక్ చేశాను. అక్కడి పరిస్థితులు చాలా ఆందోళన కలిగించాయి. చిన్న గదుల్లో స్థాయికి మించి కిక్కిరిసిన బెడ్లు.. ఎక్కడా ఎలాంటి ఫైర్ సేఫ్టీ నిబంధనలు కనిపించలేదు. సెల్లార్లలో మెస్‌లు.. భద్రతకోసం వేసిన గ్రిల్స్.. వాటికి తాళాలు. ఎక్కడా ఫైర్ ఎక్స్టింగ్విషర్లు కనిపించ లేదు. నాలుగైదు అంతస్తులున్న హాస్టల్ భవనంలో పొరపాటున నిప్పు రగిలితే ఆ ప్రమాదాన్ని ఊహించలేం. ఇలాంటి పరిస్థితులకు చెక్ పెడదాం.. అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. స్వయంగా చూసిన పరిస్థితులను వివరించి హాస్టల్ నిర్వాహకులను హెచ్చరించారు. ప్రతి గదిలో ఫైర్ ఎక్స్టింగ్విషర్లు పెట్టుకోండి. స్మోక్ డిటెక్టర్లు బిగించండి. ఒక వేళ ప్రమాదం జరిగితే వెంటనే సురక్షితంగా బయట పడేందుకు సరైన మార్గం ఉండేలా చూసుకోండి. రెండో స్టెయిర్‌కేస్ (మెట్ల మార్గం)కు అవకాశం ఉంటే పెట్టండి. లేదంటే ల్యాడార్లతో కిందుకు దిగేలా ఏర్పాట్లుచేయండి. కరెంటు వినియోగం పట్ల జాగ్రత్తలు అవసరం.. ఫైర్ ఎక్స్టింగ్విషర్లు వాడడంపై అవగాహన పెంచండి. ఇవన్నీ చిన్నపాటి జాగ్రత్తలే.. ఖర్చు కూడా తక్కువ.. ఇవే పెను ప్రమాదాలను నివారిస్తాయని హైడ్రా కమిషనర్ చెప్పారు.

**హైడ్రా జాగ్రత్తలు పాటిస్తాం**

అగ్ని ప్రమాదాలపై హైడ్రా జాగ్రత్తలను తూచా తప్పకుండా పాటిస్తామని హాస్టళ్ల నిర్వాహకులు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. చదువులు, ఉద్యోగ, ఉపాధికోసం వచ్చిన వారికి ఫుడ్, బెడ్ ఇచ్చి తాము జీవనోపాధి పొందుతున్నామని.. వారి భద్రతకు ప్రాధాన్యమిస్తామని చెప్పారు. చెరువులు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ భూముల, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల పరిరక్షణతో పాటు పర్యావరణ హితమైన నగర నిర్మాణంలో హైడ్రా కృషి అభినందనీయం.. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ని పెంచడంలో ప్రభుత్వ కృషిలో తాము కూడా భాగస్వామ్యం అవుతామని సైబరాబాద్ హాస్టళ్ల యజమానుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు అమర్‌నాథ్ రెడ్డి, కరుణాకర్ తో పాటు హాస్టళ్ల నిర్వాహకులు తెలిపారు. హాస్టళ్లలో నివాసం ఉంటున్న వారి భద్రత ప్రాధాన బాధ్యతగా భావిస్తామన్నారు. హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య, ఆర్ఎఫ్‌వో జయప్రకాష్, డీఫ్‌వోలు యజ్ఞ నారాయణ, గౌతమ్, ఏడీఎఫ్‌వో మోహనరావుతో పాటు.. ఎస్ ఎఫ్‌వోలు, జంటనగరాలలోని హాస్టళ్ల నిర్వాహకులు పలువురు ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మంత్రి ఆదేశాలను అమలు చేయండి

- కేబుల్ చానెల్స్ కు ఐ అండ్ పీఆర్ లో అక్రెడిటేషన్స్ ఇవ్వండి.
- కమిషనర్ ప్రియాంకకు టీయూ డబ్ల్యూ జే, కేబుల్ జర్నలిస్టుల జేఏసీ నేతల వినతి






హైదరాబాద్, నవతరం: కేబుల్ చానెల్స్ కు గతంలో లాగే ఐ అండ్ పీఆర్ లో అక్రెడిటేషన్ కార్డులు ఇస్తామని సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సి. హెచ్ ప్రియాంక హామీ ఇచ్చారు. సవరించిన జీ.ఓ లో సైతం కేబుల్ చానెల్స్ కు జరిగిన అన్యాయాన్ని టీయూ డబ్ల్యూ జే, కేబుల్ చానెల్స్ జేఏసీ నేతలు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లగా ఆమె సానుకూలంగా స్పందించారు. జీ.ఓ 239 లో కేబుల్ చానెల్స్ కు ఇచ్చిన అక్రెడిటేషన్స్ వివరాలను ఈ సందర్భంగా యూనియన్ నేతలు కమిషనర్ కు వివరించారు. కేబుల్ ఛానెల్స్ కు జరుగుతున్న అన్యాయాన్ని టీయూ డబ్ల్యూ జే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతీ సాగర్ క్షుణ్ణంగా వివరించారు. గతంలో ఇదే విషయాన్ని సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా పాత జీ ఓ ప్రకారం కేబుల్ జర్నలిస్టులకు కార్డులు ఇస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని కమిషనర్ కు తెలిపారు. దీంతో స్పందించిన కమిషనర్ ఇదే విషయాన్ని మరో మారు మంత్రితో చర్చించి న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. 15 సంవత్సరాల జర్నలిస్టుగా అనుభవం కలిగిన ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు కూడా ఫ్రీ లాన్స్ జర్నలిస్టులుగా అవకాశం కల్పించాలని, ప్రస్తుతం కేవలం ప్రింట్ మీడియా వారికి మాత్రమే ఈ అవకాశాన్ని కల్పిస్తున్నారని కమిషనర్ దృష్టికి తెచ్చారు. ఈ విషయంలో కూడా సానుకూలంగా స్పందించిన కమిషనర్ తప్పకుండా వారికి కూడా అవకాశం కల్పిస్తామన్నారు. అక్రెడిటేషన్స్ జారీలో కేబుల్ చానెల్స్ కు న్యాయం చేసేలా త్వరలో సవరణలు చేస్తామని కమిషనర్ ప్రియాంక స్పష్టం చేశారు. కమిషనర్ ను కలిసిన వారిలో టీయూ డబ్ల్యూ జే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీ సాగర్, తెంజు ప్రధాన కార్యదర్శి ఎ.రమణ కుమార్,
టీయూ డబ్ల్యూ జే కోశాధికారి పి. యోగనంద్, కేబుల్ చానెల్స్ జేఏసీ నేతలు కడకంచి వెంకటేష్, హెచ్.వి చలపతి రాజు, దేవేందర్, భరత్, అరవింద్ తదితరులు ఉన్నారు.

# ప్రభాతభేరి సామాజిక రుగ్మతలపై సమరభేరి

**తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో**





హైదరాబాద్, నవతరం: తెలంగాణ ప్రభుత్వం సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చొరవతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభాతభేరి సామాజిక రుగ్మతలపై సమరభేరి సాంస్కృతిక కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి,

కళాకారులు తమ ఆటపాటలతో డ్రామా రూపంలో గంజాయి వాడొద్దని,యువత డ్రగ్స్ కు బానిస కావద్దని, ప్రజలు అంగు ఆర్భాటాలకు పోయి లక్షల ఖర్చు పెట్టుకుని అప్పుల పాలు కావద్దని, యువత తల్లిదండ్రుల పట్ల ప్రేమ ఆప్యాయలతో మెలగాలని అనే సందేశాలను ఇస్తూ ఆలోచనత్మకంగా సందేశాలను ఇస్తూ సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున హాజరైన సాంస్కృతిక శాఖ సలహాదారులు దరువు అంజన్న మాట్లాడుతూ టూరిజం మరియు సాంస్కృతిక శాఖ మాత్యులు జూపల్లి కృష్ణారావు గారు ఎంతో ఆలోచనతో సామాజిక రుగ్మతలను రూపుమాపాల నటువంటి సామాజిక బాధ్యతతో ఈ యొక్క ప్రభాతభేరి కార్యక్రమాన్ని చేపట్టారని జనవరి నెలలో మేడారంలో జరిగిన సమ్మక్క సారక్క జాతరలో సుమారు 150 మంది కళాకారులతో నాలుగు రోజులపాటు వివిధ రకాల సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించామని అదేవిధంగా ఏడుపాయల్లో నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి తోడ్పడునందించిన భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు ఏనుగు నరసింహారెడ్డి గారికి ఏడుపాయల ఎండోమెంట్ ఆఫీసర్ వీరేశం గారికి పాల్గొన్న కళాకారులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ సందర్భంగా కళాకారులు చేసిన కార్యక్రమాలు భక్తుల్ని ఎంతగానో ఆలోచింపజేశాయి అలరించాయి.

# పూరీ తీరాన కేసీఆర్ జన్మదిన వేడుకలు

- ఒడిశా రాష్ట్రంలో జన్మదినం సందర్భంగా కేసీఆర్ సైకత శిల్పం
- ఏర్పాటు చేసిన శేరిలింగంపల్లి ఉద్యమకారుడు చిర్రా రవీందర్ యాదవ్
- తెలంగాణ జాతిపిత కేసీఆర్ అని సందేశం
- హీ డిమాండ్, వీ బిలీవుడ్, తెలంగాణ వాస్ బార్న్ ఏ ప్రామిస్ ఫుల్ ఫిల్డ్..
- తెలంగాణ రాష్ట్ర ప్రధాత, బంగారు తెలంగాణ నిర్మాత, జన హృదయ నేత, కారణజన్ముడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి అంటూ సైకత శిల్పంలో ఏర్పాటు
- పూరీ తీరాన ఏర్పాటు చేసిన శేరిలింగంపల్లికి చెందిన భారాస సీనియర్ నేత చిర్రా రవీందర్ యాదవ్
- పర్యాటకులను ఆకట్టుకుంటున్న కేసీఆర్ సైకత శిల్పం










హైదరాబాద్, నవతరం: తెలంగాణ జాతిపిత కేసీఆర్ అంటూ, భారాస అధినేత కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఒడిశా రాష్ట్రం పూరీ తీరాన సైకతం శిల్పంను ఏర్పాటు చేశారు. భారాస అధినేత కేసీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ శేరిలింగంపల్లికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, భారాస సీనియర్ నేత చిర్రా రవీందర్ యాదవ్ సైకత శిల్పాన్ని ఏర్పాటు చేయించారు. ఈ సైకత శిల్పంలో హీ డిమాండ్, వీ బిలీవుడ్, తెలంగాణ వాస్ బార్న్ ఏ ప్రామిస్ ఫుల్ ఫిల్డ్.. తెలంగాణ రాష్ట్ర ప్రధాత, బంగారు తెలంగాణ నిర్మాత, జన హృదయ నేత, కారణజన్ముడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి అంటూ రాశారు. తెలంగాణ జాతిపిత కేసీఆర్ అని సందేశం ఇచ్చేలా సైకత శిల్పంలో ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన స్ఫూర్తితో తెలంగాణ రక్షణ కొరకు మరో ఉద్యమం దిశగా అడుగులు వేస్తున్నట్లుగా రూపొందించారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి యువ నాయకులు చిర్రా రవీందర్ యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణను సాధించి, అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్ కే దక్కిందన్నారు. ముమ్మాటికి తెలంగాణ జాతిపిత కేసీఆర్ అని, ఆయురారోగ్యాలతో కేసీఆర్ క్షేమంగా ఉండాలని కోరుకుంటూ జన్మదిన శుభాకాంక్షలను చిర్రా రవీందర్ యాదవ్ వెల్లడించారు. పూరీ తీరాన పర్యాటకలను కేసీఆర్ సైకత శిల్పం ఆకట్టుకుంటుంది. టూరిస్ట్ లు సైకతం శిల్పం వద్ద ఫోటోలు దిగుతూ కేసీఆర్ కి జన్మదిన వేడుకలను తెలుపుతున్నారు.

# తిరుమలకుంట లో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

**పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి న మాజీ ఎమ్మెల్యే తాటి**




నవతరం ప్రతినిధి, ఖమ్మం భద్రాద్రి జిల్లా తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు 72వ జన్మదిన వేడుకలు అశ్వారావుపేట మండల బిఆర్ఎస్ పార్టీ కన్వీనర్ జుజ్జురు వెంకన్న బాబు, అధ్యక్షుడు బొల్లు కొండ చెన్నారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ తాటి వెంకటేశ్వర్రావు, కాసాని చంద్రమోహన్, సంకా ప్రసాద్, వాగ్గేల పూజ, అంకత మల్లికార్జునరావు, జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, రఘురాం,వారు ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం కొట్లాడి.. సాధించి 10 ఏండ్ల పాటు అభివృద్ధి పాదంలో రాష్ట్రాన్ని నడిపించి దేశానికే ఆదర్శంగా నిలిపారని. 2ఏండ్ల తరువాత మళ్లీ తెలంగాణ రాష్ట్రానికి కెసిఆర్ ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని .భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో సోయం వీరభద్రం, మాడి ముత్యాలరావు, మొద్దు మరియమ్మ, పానుగంటి లక్ష్మణరావు, గోదా వెంకటేశ్వరరావు, నారం నాగలక్ష్మి, రమేష్, జుజ్జూరు వెంకటేశ్వరరావు, జుజ్జూరు సత్యనారాయణ, పానుగంటి వేణు,పానుగంటి చెన్నకేశవులు, బు బత్తుల చెన్నారావు, వంశి,తదితరులు ఉన్నారు.

# 'భూ' దందా పరాకాష్ట యజమానిపై ఇనుప రాడ్లతో దాడి

**- బోరు వేసే క్రమంలో కబ్జా యత్నం,108 సర్వే నంబర్ భూమిలో రగులుతున్న సెగలు**

**- భూభారతి సర్వేల వేళ 'రఘురామ్' ఘటనపై పోలీసుల మౌనం.. రాజకీయ ఒత్తిళ్లేనా?**



నవతరం ప్రతినిధి, ఖమ్మం భద్రాద్రి జిల్లా


భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట మండలంలో భూ వివాదాలు నివురు గప్పిన నిప్పులా మారాయి. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వచ్చిన 'ధరణి' పోర్టల్ కొన్ని సమస్యలను తీర్చినప్పటికీ, మరికొన్ని కొత్త చిక్కులను తెచ్చిపెట్టింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 'భూభారతి' చట్టం ద్వారా ప్రత్యేక సర్వేలు నిర్వహిస్తూ సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం సామాన్య రైతులకు రక్షణ కరువైంది.

**ఘటనా నేపథ్యం: నమ్మించి గొంతు కోశారా?**

అశ్వారావుపేట మండలంలోని 108 సర్వే నంబర్లో గల భూమి విషయంలో బాధితుడు ముళ్ళపూడి రఘురామ్ తన పొలంలో వ్యవసాయ పనుల నిమిత్తం ఒక వ్యక్తికి అవకాశం ఇచ్చారు. అయితే, అది కేవలం వ్యవసాయం చేసుకోవడానికే తప్ప, కౌలుకు ఇచ్చినట్లు కాదని బాధితుడు స్పష్టం చేస్తున్నారు. కానీ, సదరు వ్యక్తి ఆ భూమిపై హక్కులు క్లెయిమ్ చేస్తూ కబ్జాకు తెరలేపడం వివాదానికి కేంద్ర బిందువైంది.

**ఇనుప రాడ్లతో ప్రాణాంతక దాడి**

తన సొంత పొలాన్ని కబ్జా చేసి బోరు వేయించేందుకు కబ్జారాయుళ్ళు ప్రయత్నించగా, రఘురాం అడ్డగించారు. "నా భూమిలో నేను బోరు వేసుకుంటే నీకేంటి?" అని ప్రశ్నించినందుకు, పథకం ప్రకారం ఇనుప రాడ్లతో రఘురామ్‌పై విచక్షణారహితంగా దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో రఘురామ్ తీవ్రంగా గాయపడ్డారు. తలకు భయంకరమైన గాయాలయ్యాయి. కాళ్లు చేతులు విరిగాయి. సదరు వ్యక్తి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు ఇప్పటికీ పది రోజులు గడుస్తుండడంతో స్థానిక ప్రభుత్వాసుపత్రి






వైద్యుల సలహా మేరకు రఘురాం జిల్లా ఆసుపత్రిలో వైద్య సహాయం పొందుతున్నాడు.

ప్రత్యక్ష సాక్ష్యాలు, బాధితుడి వాంగ్మూలం ప్రకారం ఇది ముమ్మాటికీ ప్రాణాపాయం కలిగించేలా జరిగిన దాడి అని స్పష్టమవుతోంది.

**వైద్యం పొందుతున్నా.. పోలీసులకు పట్టింపేది?**

తీవ్ర గాయాలపాలైన రఘురామ్‌ను స్థానిక ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ ఆయన చికిత్స పొందుతున్నారు. అయితే, ఈ ఘటన జరిగి 10 రోజులు గడుస్తున్నా పోలీసులు ఎందుకు కేసు నమోదు చేయడం లేదన్నది ఇప్పుడు మిస్టరీగా మారింది.

పది రోజుల క్రితమే ఫిర్యాదు ఇచ్చినా ఎఫ్.ఐ.ఆర్ ఎందుకు నమోదు కాలేదు?

బాధితుడు మంచాన పడి ఉన్నా, మళ్లీ కొత్తగా దరఖాస్తు ఇవ్వాలని పోలీసులు కోరడం వెనుక ఆంతర్యమేమిటి?

నిందితుల వెనుక ఉన్న ఆ 'అదృశ్య' రాజకీయ శక్తులు ఎవరు?

**భూభారతి చట్టం - కొత్త సవాళ్లు**

రాష్ట్ర ప్రభుత్వం భూభారతి ద్వారా భూ సమస్యలను పరిష్కరిస్తామని చెబుతున్నా, అశ్వారావుపేట వంటి చోట్ల పాత కక్షలు, కొత్త కబ్జాలు వెలుగులోకి వస్తున్నాయి. రఘురామ్ విషయంలో సాక్ష్యాధారాలు స్పష్టంగా ఉన్నప్పటికీ, పోలీసులు జాప్యం చేయడం వల్ల నిందితులు సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

అధికార గర్వం, అంగబలం ఉన్న వ్యక్తులు సామాన్య రైతులపై దాడులకు పాల్పడుతుంటే చట్టం తన పని తాను చేసుకుపోతుందా? లేక రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గుతుందా? అనే ప్రశ్నలు మండల వ్యాప్తంగా వినిపిస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి 108 సర్వే నంబర్ భూ వివాదంపై విచారణ జరిపి, రఘురామ్‌పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ పెరుగుతోంది.

# ఆర్ఎన్ఐ గుర్తింపు ఉన్న పత్రికలకూ అక్రెడిటేషన్లు ఇవ్వాలి

**-మంత్రి పొంగులేటిని కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు**

హైదరాబాద్, నవతరం: కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆర్ఎన్ఐ, పీఆర్ జీఐ రిజిస్ట్రేషన్ కలిగిన చిన్న,మధ్య తరహా పత్రికలకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య రాష్ట్ర సమాచార, పౌరసంబధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. మంగళవారం రోజు ఆయన పలువురు ఫెడరేషన్ నాయకులు సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మంత్రితో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత స్వరాష్ట్రంలో గత పదేండ్లు చిన్న, మధ్య తరహా పత్రికల అణచివేత కొనసాగిందని,ఇప్పటికైనా ప్రజా ప్రభుత్వంలో న్యాయం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మీడియా సంస్థలకు ఈసారి 44 వేలకు పైగా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు ప్రకటించినప్పటికీ, కేవలం ఎంపానల్మెంట్ అయిన కొన్ని పత్రికలకు,చానళ్ళకు మాత్రమే ఇస్తున్నారని, ఎంపానల్ కాని ఆర్ఎన్ఐ, పీఆర్జీఐ రిజిస్ట్రేషన్ తో నడుస్తున్న అమిగతా పత్రికలకు ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఎంపానల్మెంట్ తో సంబంధం లేకుండా ఆర్ఎన్ఐ గుర్తింపు ఉన్న అన్ని పత్రికలకు ఆయా పత్రికల సర్క్యులేషన్ ఆధారంగా జర్నలిస్టులందరికి అక్రెడిటేషన్ కార్డులిచ్చే వారని, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఇవ్వడం లేదని, ఎంపానల్మెంట్ అనేది కేవలం ప్రభుత్వ అడ్వర్టయిజ్మెంట్లకే అని ఆయన మంత్రికి వివరించారు. ఆర్ఎన్ఐ,పీఆర్జీఐ గుర్తింపు ఉన్న పత్రికలను ఎంప్యానల్ చేయాలని, అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని మామిడి సోమయ్య మంత్రికి విజ్ఞప్తి చేశారు.ప్రింటింగ్ ప్రెస్ కోసం ఒక ఎకరం భూమిని ప్రభుత్వ నామినల్ ధరకు ఇచ్చి ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటుకు రుణ సదుపాయం కల్పించాలని కోరారు. జర్నలిస్టులకు అక్రెడిటేషన్ ఉన్న జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీలో ప్రయాణించేందుకు ఉచిత బస్ పాస్ ఇవ్వాలని, హెల్త్‌కార్డులు,భీమా సౌకర్యం కల్పించాలన్నారు. మంత్రిని కలిసిన వారిలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కో-కన్వీనర్ తన్నీరు శ్రీనివాస్, నాయకులు హైదరాబాద్






జిల్లా కన్వీనర్ వి.రవికుమార్, కో- కన్వీనర్లు శ్రీనివాస్ గౌడ్, బ్రహ్మం,సూర్యాపేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పాల్వాయి జానయ్య, హరిప్రసాద్, అంజిబాబు నాగుల జర్నలిస్ట్ తదితరులు పాల్గొన్నారు.

# పేద కుటుంబానికి 'యలమందల' ఆపన్నహస్తం

**- నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, 25కిలోల బియ్యం, 2వేలు నగదు**

**- పేదలకు యలమందల జగదీష్ సేవలు ఆదర్శప్రాయం**

ఖమ్మం, ఫిబ్రవరి 17 (నవతరం): ఆపదలో ఉన్న ఓ పేద కుటుంబానికి నెలకు సరిపడా నిత్యవసర సరుకులు, బియ్యం, ఆర్థిక సాయం అందజేసి మానమత్వాన్ని చాటుకున్న మంచి మనసున్న నాయకులు, నాయి బ్రాహ్మణ నగర అధ్యక్షులు, ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్షులు యలమందల జగదీష్. ఖమ్మం అర్బన్ మండలం, కైకొండాయి గూడెం, 1వ డివిజన్ కు చెందిన ఆంగోత్ భద్రు అంధుడు. అతనికి ప్రమాదం జరిగి కాలు ఇంపెక్షన్ తో నడవలేని పరిస్థితిలో కుటుంబ భారంతో ఉన్నాడు. అతనికి ఇద్దరు ఆడపిల్లలు. కుటుంబం గడవడమే కష్టంగా ఉంది. భద్రు కుటుంబ పరిస్థితిని గమనించిన నాయి బ్రాహ్మణ నగర అధ్యక్షులు యలమందల జగదీష్ మానవత్వంతో మంగళవారం ఆ కుటుంబానికి తక్షణ సహాయంగా నెలకు సరిపోయే నిత్యావసర వస్తువులు, 25కిలోల బియ్యంతో పాటు 2వేల రూపాయల నగదు ఇవ్వడం జరిగింది. పేద కుటుంబాన్ని ఆదుకున్న విషయం గ్రామమంతా చర్చిని అంశంగా మారింది. మానవత్వం ఇంకా బ్రతికే ఉంది. మంచి మనసులు మన మధ్యనే ఉన్నారని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. కనీసం బంధువులు కూడా ఇటువంటి సహాయాన్ని అందించరని బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు. పేద కుటుంబానికి సాయం అందించిన యలమందల జగదీష్ కు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ నగర అధ్యక్షులు, ఎలక్ట్రానిక్ మీడియా నగర



అధ్యక్షులు యలమందల జగదీష్, లాంబాడీ హక్కుల పోరాట సమితి భద్రు నాయక్, నూర్ భాషా జిల్లా ప్రధాన కార్యదర్శి మీరా, నూర్ భాషా అధికార ప్రతినిధి అన్వర్ పాషా, ఆంగోతు కిషోర్,
తేజావత్ రాంకోటి, వీరస్వామి, పుల్లయ్య, శ్రీనివాస్, ఉబ్బనపల్లి రాము, తేజావత్ రమేష్, మహిళలు, గ్రామస్తులు, ప్రజలు పాల్గొన్నారు.

# పెరిగిన రిగ్గు బోర్వెల్ ధరలు





కుత్బుల్లాపూర్, నవతరం: తెలంగాణ రిగ్గు యజమానుల సంఘం అధ్యక్షులు అంజిరెడ్డి ఆధ్వర్యంలో గండి మైసమ్మ ఎక్స్ రోడ్ లోని మేకల వెంకటేశం గార్డెన్లో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా రిగ్గు అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ... రిగ్గు నిర్వహణ భారీగా పెరిగిన ధరల వల్ల నడవడం చాలా ఇబ్బందిగా మారిందన్నారు. కావున సవరించిన ధరలు ఫిబ్రవరి 22 నుండి అమలులోకి వస్తున్నాయి, కాబట్టి బిల్డర్లు స్థల యజమానులు సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 4 1/2, రిగ్ బోరెవెల్ ప్రెసిడెంట్ వెంకటేష్, జనరల్ సెక్రటరీ ఓరుగంటి లక్ష్మీనారాయణ, రోబో రాజనీకాంత్, విక్రమ్ శర్మ, అధ్యక్షులు అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సిరెడ్డి,
కోశాధికారి ఎస్. మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులు కే జంగయ్య గౌడ్, కే శ్రీనివాసరెడ్డి, బి జగన్మోహన్ రెడ్డి, ఎస్ అశోక్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులు ఎన్. బుచ్చిరెడ్డి, ఎస్. శ్రీనివాస్ రెడ్డి, ఎస్. మదన్మోహన్ రెడ్డి, బి.జంగయ్య యాదవ్, ఎన్. శ్రీనివాసరెడ్డి, బి. విజయ శేఖర్ రెడ్డి, పవన్ కళ్యాణ్, పలువురు రిగ్గు యజమానులు పాల్గొన్నారు.

## 20న గచ్చిబౌలి స్టేడియంలో సీఎం కప్-2026

హైదరాబాద్,ఫిబ్రవరి17 ఫిబ్రవరి 20న గచ్చిబౌలి స్టేడియంలో ప్రారంభంకానున్న సీఎం కప్-2026 కార్యక్రమానికి హాజరుకావాలని రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు అనుముల రేవంత్ రెడ్డిని రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివాసేనరెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఓఆ సోనిబాలాదేవి లు ఆహ్వానించారు.\÷లంగాణలోని పల్లె నుంచి పట్నం వరకు విద్యార్థులు, యువతీ,యువకుల్లో దాగి క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. మొత్తం 44 రకాల క్రీడలను సీఎం కప్‌లో భాగంగా పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కీడలల్లో పాల్గొనడం వల్ల పోటీతత్వంతో శారీరక దృఢత్వం మెరుగుపడుతుందని మంత్రి వాకిటి శ్రీహరి అభిప్రాయపడ్డారు. సీఎం కప్‌ను పాఠశాల విద్యనుంచి యూనివర్శిటీ స్థాయి విద్యార్థుల వరకు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరి కోరారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు స్నేహితుల దుర్మరణం

పాడేరు,ఫిబ్రవరి17 జాతరకు వెళ్లి తిరిగివస్తుండగా జరిగిన ప్రమాదం ముగ్గురు స్నేహితులను బలి తీసుకుంది. ఈ ఘటన వంతలగుమ్మి సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గెమ్మలి రమేశ్ (22), సిదరి శ్రీధర్ పొలు (17), రేగం సూర్యప్రకాష్(21) ముగ్గురు స్నేహితులు. శివరాత్రి సందర్భంగా హుకుంపేట మండలంలో జరిగిన మత్స్యగుండం జాతరకు వెళ్లారు. అనంతరం తిరిగి తమ స్వగ్రామాలకు వస్తుండగా వంతలగుమ్మి సమీపంలోని మలుపు వద్ద వీరి ద్విచక్రవాహనం వేగంగా వస్తూ రెండు విద్యుత్ స్తంభాల మధ్యలోనుంచి వెళ్లి ఓ ఇంటి గోడను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి చెందారు. ఈ ప్రమాదంలో ఘటనా స్థలంలోనే ఇద్దరు చనిపోగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందారు . ఈ ప్రమాదంపై పాడేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పెళ్లికి ముందే శారీరక సంబంధాలు సరికాదు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి17 నేటి కాలంలో సోషల్ మీడియా, మ్యాట్రిమోనీ సైట్ల ద్వారా పరిచయాలు పెరిగి మోసపోతున్న ఘటనలు ఎక్కువవుతున్న నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. వివాహానికి ముందు ఏర్పరచుకునే శారీరక సంబంధాల విషయంలో యువత అత్యంత అప్రమత్తంగా ఉండాలని సుప్రీంకోర్టు సూచించింది. ఒక వ్యక్తి గురించి పూర్తిగా తెలియకుండా లైంగిక సంబంధంలోకి వెళ్లడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించిన ధర్మాసనం, పెళ్లికి ముందు ఎవరినీ సులభంగా నమ్మకూడదని స్పష్టం చేసింది. ఈ వ్యాఖ్యలు చేయడానికి కారణమైన కేసు వివరాల్లోకి వెళితే.. 2022లో ఒక మ్యాట్రిమోనీ సైట్ ద్వారా ఒక యువతికి ఓ యువకుడు పరిచయమయ్యాడు. తాను పెళ్లి చేసుకుంటానని ఆమెను నమ్మించి, పలుమార్లు శారీరక సంబంధం పెట్టుకున్నాడు.

అయితే, సదరు యువకుడికి అప్పటికే రెండు పెళ్లిళ్లు అయ్యాయని బాధితురాలికి ఆలస్యంగా తెలిసింది. దీనిపై ఆమె నిలదీయగా, తమకు సంబంధించిన ప్రైవేట్ వీడియోలను బయటపెడతానని అతడు బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు అతనిపై అత్యాచారం కేసు నమోదు చేశారు.

Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: navataramtelugudaily@gmail.com, Telangana State Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com